

క్రీడాకారులకు కలెక్టర్ వెట్రిసెల్వి అభినందన

కలెక్టర్‌ను కలిసిన రాష్ట్ర స్విమ్మింగ్ ఛాంపియన్ షిప్‌లో విజేతలు

ప్రజాశక్తి - ఏలూరు

కర్నూలులో జరిగిన తొమ్మిదో సబ్ జూనియర్, జూనియర్స్ రాష్ట్ర స్విమ్మింగ్ ఛాంపియన్ షిప్‌లో ఏలూరు జిల్లా తరపున పాల్గొని బంగారు, రజిత, కాంస్య పతకాలు సాధించిన స్విమ్మింగ్ క్రీడాకారులను కలెక్టర్ కె.వెట్రిసెల్వి అభినందించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని స్థానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జెసి బి.లావణ్యవేణిలను మర్యాదపూర్వకంగా విజేతలు కలిశారు. ఈ సందర్భంగా వారికి అభినందనలు తెలుపుతూ భవిష్యత్తులో జాతీయస్థాయిలో ఉత్తమ ప్రదర్శన ప్రదర్శించి మరిన్ని పతకాలు సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. స్విమ్మింగ్ ఛాంపియన్ షిప్‌లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులను జెసి బి.లావణ్యవేణి అభినందించారు. క్రీడాకారులతో పాటు డిఎస్‌డిఒ బి.శ్రీనివాసరావు, జిల్లా స్విమ్మింగ్ అసోషియేషన్ సెక్రటరీ ఐ.మల్లికార్జునరావు తదితరులు ఉన్నారు.

పింఛన్లు తేల్చండి..!

రెండు జిల్లాల్లో దాదాపు పది వేల దరఖాస్తులు పెండింగ్

కొత్త ప్రభుత్వం రాకతో అందరిలోనూ కొత్త ఆశలు

గత ప్రభుత్వం నిబంధనల పేరుతో కొర్రీలు

అర్హులను తేల్చి పింఛను అందించాలని వేడుకోలు

అధికారులు, రాజకీయ నాయకుల చుట్టూ ప్రదక్షిణలు

'నిడమర్రు మండలం అడవికొలను గ్రామానికి చెందిన పి.మహేష్ వికలాంగుల కోటాలో పింఛను కోసం దరఖాస్తు చేసుకుని చాలా కాలం గడిచింది. గత ప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రభుత్వం మారింది. తన దరఖాస్తు పరిశీలించి పింఛను అందేలా చూడాలని కోరుతున్న పరిస్థితి నెలకొంది. పింఛను అందితే వైద్యానికైనా చేయూతగా ఉంటుందని ఆ కుటుంబం ఆశిస్తోంది.'

'భాస్కర్‌రావు అనే వ్యక్తి ఈ ఏడాది జనవరిలో వృద్ధాప్య పింఛనుకు దరఖాస్తు చేసుకున్నాడు. గత ప్రభుత్వ హయాంలో మంజూరు కాలేదు. ఇంతలో ఎన్నికలు జరిగి ప్రభుత్వం మారింది. తనకు పింఛను ఎప్పటికొస్తుందోనన్న ఆందోళన ఆయనను వెంటాడుతోంది. పింఛన్ సొమ్ము వస్తే తనకు ఆసరాగా ఉంటుందని ఎదురుచూస్తున్నాడు.'



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పైన పేర్కొన్న మహేష్, భాస్కరరావులే కాదు.. వృద్ధాప్య, వికలాంగుల, వితంతు వంటి వివిధ రకాల పింఛన్ల కోసం రెండు జిల్లాల్లో దాదాపు పది వేల మంది ఎదురుచూస్తున్న పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వం ఏటా జనవరి, జులై నెలల్లో కొత్త పింఛన్లకు సంబంధించిన లబ్ధిదారుల జాబితాను ప్రకటించేది. ఈ ఏడాది జనవరిలో కొత్త పింఛన్లకు సంబంధించిన లబ్ధిదారులను ప్రకటించలేదు. దీంతో ఎంతోమందికి అర్హత ఉన్నా పింఛన్ అందుకోలేని పరిస్థితి. కొత్త పింఛన్ల కోసం పశ్చిమగోదావరి జిల్లాలో 4,200 మంది, ఏలూరు జిల్లాలో ఐదు వేల మందికి పైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీరంతా 2023 జులై తర్వాత పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్నవారే. పెరిగిన ధరలు, ఆరోగ్య సమస్యల నేపథ్యంలో వృద్ధులు, వికలాంగులు పింఛను సొమ్ము వస్తే ఆసరాగా ఉంటుందని అంతా ఆశగా ఎదురుచూస్తున్నారు. గత ప్రభుత్వం అనేక నిబంధనలను తెరపైకి తెచ్చి అర్హులకు సైతం పింఛన్లను నిలిపివేసింది. అర్హత ఉన్నా పింఛను అందక ఎంతోమంది ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ, ప్రజాప్రతినిధుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నారు. కరెంటు బిల్లు మూడొందల యూనిట్లు దాటిందని, భూములు, కార్లు ఉన్నాయంటూ ఎంతోమందికి పింఛను ఆపేసింది. అవేమీ తమకు లేవని ఆయా శాఖల అధికారుల నుంచి పత్రాలు తెచ్చి మళ్లీ మళ్లీ దరఖాస్తు చేసుకున్నా పింఛను మాత్రం రాలేదు. కుమారులకు మూడొందల యూనిట్లు దాటి కరెంటు బిల్లు వస్తే వారి తల్లిదండ్రులకు పింఛను ఆపేసిన ఘటనలు అనేకం ఉన్నాయి. కుమారుడికి సచివాలయ ఉద్యోగం వచ్చిందని తల్లిదండ్రులకు పింఛను నిలిపివేసిన పరిస్థితులు నెలకొన్నాయి. భూములు లేకపోయినా ఉన్నాయంటూ పింఛనుకు గండికొట్టారు. దీంతో అలాంటి వారంతా పింఛన్ల కోసం కాళ్లరిగిలా కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడింది. పింఛన్ సొమ్మును రూ.నాలుగు వేలకు పెంచింది. జులైలో పెంచిన పింఛను సొమ్మును అందించారు. దీంతో తమకు అర్హతున్నా పింఛను రాకపోవడంపై బాధితులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ప్రస్తుతం జీవన పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. వయస్సు పైబడినవారిని అనారోగ్య సమస్యలు చుట్టుముడుతున్నాయి. షుగర్, బిపి, కీళ్ల నొప్పులు వంటి వ్యాధులు సర్వసాధారణం అన్నట్లు మారిపోయాయి. మాత్రలు మింగితే తప్ప రోజు గడిచే పరిస్థితి లేదు. అనార్యో సమస్యలతో పనికి వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో వృద్ధులు, వికలాంగులు, అనార్యో సమస్యలతో మంచానపడ్డ వారికి పింఛన్ సొమ్మే జీవనాధారంగా మారింది. పెరిగిన ధరల నేపథ్యంలో సామాన్య కుటుంబాల్లో రోజు గడవడమే పెద్ద సవాల్‌గా మారింది. దీంతో ఇంట్లో పెద్దలను చూసుకోవడం మరింత కష్టంగా మారుతోంది. పింఛను వస్తే కనీసం వారికి కావాల్సిన మందులు వంటి వాటి కోసం కుటుంబ సభ్యులపై ఆధారపడాల్సిన పరిస్థితి తగ్గుతుంది. దీంతో అర్హత ఉన్నా పింఛను రాకపోవడంతో చాలా మంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండు జిల్లాల్లో ఈ సంఖ్య పదివేల వరకూ ఉందంటే పరిస్థితి ఏంటో అర్థం చేసుకోవచ్చు.

కొత్త పింఛన్ల ఎంపికపై నిర్ణయం ఎప్పుడో..

పింఛన్ల దరఖాస్తుల పరిశీలనకు సంబంధించి కొత్త ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోలేదు. దీంతో దరఖాస్తు దారులంతా ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూపులు చూస్తున్న పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం వెంటనే కొత్త పింఛన్లకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేపట్టాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు. ఇది జరిగితే ఎంతోమంది ఊరట పొందనున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొలుసు పార్థసారథి

జిల్లా అభివృద్ధికి సమిష్టిగా కృషి చేద్దాం

రాష్ట్ర సమాచార, గృహ నిర్మాణ శాఖా మంత్రి పార్థసారథి

ప్రజాశక్తి - ఏలూరు

ప్రజాప్రతినిధులు, అధికారులు అందరం కలిసి జిల్లా అభివృద్ధికి సమిష్టిగా కృషి చేద్దామని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారధి పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశం హాల్లో సోమవారం సాయంత్రం అధికారులతో వివిధ వారీగా అమలు జరుగుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జిల్లా ఎంఎల్ఎలతో కలిసి సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నిలిపేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. వార్షిక రుణప్రణాళికలో రైతులకు పంట రుణాలు రూ.7,300 కోట్లు లక్ష్యంకాగా, కౌలు రైతులకు కేవలం రూ.250 కోట్లు మాత్రమే లక్ష్యంగా నిర్ణయించారని, వ్యవసాయ ప్రధానమైన జిల్లాలో 75 శాతానికి పైగా సాగును కౌలు రైతులు చేస్తున్నారని, ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకుని కౌలు రైతులకు అందించే పంట రుణాల లక్ష్యాన్ని రెండు వేల కోట్ల రూపాయలకు పెంచాలన్నారు. మామిడి రైతులకు ఫ్రూట్ కవర్స్ అందించాలని, మామిడి పంటకు ఆశించే తెగులు సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఉద్యావన శాఖాధికారులను మంత్రి ఆదేశించారు. ఆయిల్ పామ్ మొక్కలను సంబంధిత కంపెనీలు రైతులకు నేరుగా అందించేలా చర్యలు తీసుకోవాలని, అందుకు సంబందించిన సబ్సిడీని కంపెనీలకు అందించే అంశాన్ని పరిశీలించాలని ఉద్యానవన శాఖాధికారులను మంత్రి ఆదేశించారు. జిల్లాలో రోడ్ల మరమ్మతులకు సంబంధించి మంజూరైన నిధులతో చేపట్టే పనులను స్థానిక శాసనసభ్యుల దృష్టికి తీసుకురావాలన్నారు. జిల్లాలో పేదల గృహ నిర్మాణ పథకంలో ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేయని కాంట్రాక్టర్లకు డబ్బులు చెల్లించిన వారిపై చర్యలు తీసుకోవడంతోపాటు, కాంట్రాక్టర్లపై కేసులు నమోదు చేయాలన్నారు. చేపల చెరువులకు కోడి వ్యర్థాల వినియోగం కారణంగా ప్రజలు అనారోగ్యం బారిన పడడమే కాక, వాతావరణం, తాగునీటి వనరులు కలుషితం అవుతాయని, వీటిపై నిఘా పెట్టి కోడి వ్యర్థాలను చేపల చెరువులకు తరలించే వారిపై కేసులు నమోదు చేయడంతోపాటు సదరు వాహనాలను సీజ్ చేయాలనీ మంత్రి అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో నియోజకవర్గాల వారీగా అమలు జరుగుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజాప్రతినిధులతో సమీక్షించేందుకు సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నియోజకవర్గ పరిధిలో చేపడుతున్న వివిధ శాఖలు చేపడుతున్న పనులను సంబంధిత శాసనసభ్యులకు తెలియజేయాలని, సమావేశంలో ప్రజాప్రతినిధులు తెలియజేసిన అంశాలపై తీసుకున్న చర్యలను సంబంధిత ఎంఎల్ఎలకు తెలియజేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ జిల్లాలోని రైతు సేవా కేంద్రాల్లోని 419 కస్టమైజ్ హైరింగ్ కేంద్రాలకు వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా మంజూరు చేసిన ట్రాక్టర్లు, రోటేవేటర్లు, తదితర వ్యవసాయ యంత్ర పరికరాలు ఒక్కరే అద్దెకు ఇచ్చి వినియోగిస్తున్నారని, అలాకాకుండా జిల్లాలోని రైతులందరూ వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న కాలనీలకు చేసిన భూసేకరణలో ఎన్నో అక్రమాలు జరిగాయని, వాటిపై పూర్తి వివరాలు వారంలోగా అందించాలని అధికారులను కోరారు. తమ్మిలేరు గట్లకు ఇరువైపులా గోడను నిబంధనలు విరుద్ధంగా నిర్మించారని, వీటిపై విచారణ చేయాలనీ కోరారు. ఏలూరు ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణయ్య (చంటి) ఏలూరు పట్టణంలో రోడ్ల మరమ్మతులకు చర్యలు తీసుకోవాలన్నారు. ఏలూరు నగరంలో 34 వేల మందికి పైగా పేదలకు ఇళుకల మంజూరై, ఇంకా పూర్తి కానీ స్టేజ్‌లో ఉన్నాయని, వాటి నిర్మాణ పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలన్నారు. కైకలూరు ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ చేపల చెరువులకు కోడి వ్యర్థాలు వినియోగిస్తున్నారని, ఈ చెరువుల్లో పెంచే మత్స్య ఉత్పత్తులు వినియోగం కారణంగా ప్రజలకు అనారోగ్యం బారిన పడడంతోపాటు పర్యావరణానికి పెనుప్రమాదం సంభవిస్తోందని తెలిపారు. ఉంగుటూరు ఎంఎల్ఎ మాట్లాడుతూ చేపల చెరువులకు కోడి వ్యర్థాల వినియోగాన్ని నియంత్రించాలన్నారు. ఆక్వా జోన్ పరిధిలోని చేపల, రొయ్యల చెరువులకు అనుమతులు మంజూరు చేయాలన్నారు. చింతలపూడి శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు హెల్మెట్ ధరించడంపై అధికారులు ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. గోపాలపురం ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు మాట్లాడుతూ ద్వారకాతిరుమలకు మండలంలో రోడ్ల మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జెసి బి.లావణ్యవేణి, ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి సూర్యతేజ, ఆర్‌డిఒలు ఎన్ఎస్‌కె.ఖాజావలీ, కె.అద్దయ్య, వై.భవానిశంకరి పాల్గొన్నారు.

పారదర్శకంగా ఉచిత ఇసుక విధానం

జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఉచిత ఇసుక విధానాన్ని పారదర్శకంగా, పటిష్టంగా అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కె.వెట్రి సెల్వి చెప్పారు. సోమవారం స్థానిక గోదావరి సమావేశ మందిరంలో జిల్లా స్థాయి శాండ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె.వెట్రి సెల్వి మాట్లాడుతూ గోదావరి పరివాహక ప్రాంతంలో ఇసుక డిసిల్టింగ్ కోసం నీటిపారుదల శాఖ సిఇ నుంచి ఇసుక సాధ్యాసాధ్యాల నివేదికలను పొందాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఉచిత ఇసుక విధానాన్ని మరింత పటిష్టంగా అమలు చేసే దిశగా ఇసుక అక్రమ వెలికితీత, రవాణా చేసే చర్యలను నిరోధించేందుకు జిల్లా స్థాయి కంట్రోల్ రూమ్‌ను మైన్స్ ఎడి కార్యాలయంలో 1800-425-6025 టోల్ ఫ్రీ నంబరుతో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అక్రమ, అనధికారిక త్రవ్వకాలపై ఉక్కుపాదం మోపుతూ అటువంటి వాటిని నిరోధించేందుకు నిర్దేశించిన జరిమానాలకు సంబంధించి విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. నిషేధిత ప్రాంతాలైన భూగర్భ జల నిర్మాణాలు, వంతెనలు, డ్యామ్‌లు, రైల్వే లైన్ల నుండి 500 మీటర్ల లోపల అక్రమ, అనధికార తవ్వకాలకు పాల్పడే అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి అటువంటి చోట్ల పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సంబంధిత ఆర్‌డిఒలు, పోలీస్, సెబ్, మైనింగ్ డిపార్ట్‌మెంట్, జిల్లా పంచాయతీ ఈ విషయంలో సమన్వయంతో పనిచేసి గట్టి నిఘా ఉంచాలన్నారు. చట్ట విరుద్ధమైన మైనింగ్, స్టాకింగ్, హోర్డింగ్, అమ్మకం, బ్లాక్ మార్కెట్‌కు పాల్పడే వ్యక్తులపై ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం చర్యలు తీసుకోవాలని, ఈ కార్యక్రమాలకు వినియోగించే వాహనాలను సీజ్ చేయడంతోపాటు జరిమానాలు విధించాలన్నారు. మైన్స్ విభాగానికి ఇసుక సమస్యలపై అందిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు జిల్లాస్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీ దృష్టికి తీసుకురావాలన్నారు. సరైన రశీదు లేకుండా ఇసుక రవాణా జరగకుండా చూడాలన్నారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, ఐటిడిఎ పిఒ ఎం.సూర్యతేజ, జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస్ విశ్వనాధ్, సబ్ జాయింట్ డైరెక్టర్ ఎన్.సూర్యచంద్రరావు, ఆర్‌డిఒలు ఎన్ఎస్ కె.ఖాజావలీ, వై.భవానీశంకరి, కె.అద్దయ్య, మైనింగ్ పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు కృషి

జిల్లా ఎస్‌పిగా ప్రతాప్ శివ కిషోర్ బాధ్యతల స్వీకరణ



ఎస్‌పిగా బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రతాప్ శివకిషోర్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

నేరాలు చేసేవారే పోలీసులకు భయపడాలని, నేరాలు చేయని వారికి పోలీసులు ఎప్పుడూ ప్రియ మిత్రులేనని, నేరాల నియంత్రణకు పూర్తిస్థాయిలో కృషి చేస్తానని జిల్లా కొత్తగా ఎస్‌పిగా నియమితులైన కొమ్మి ప్రతాప్ శివకిషోర్ అన్నారు. సోమవారం ఆయన జిల్లా ఎస్‌పి ఛాంబర్లో ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. తొలుత ఆయన ఎఆర్ సిబ్బంది ఇచ్చిన గౌరవం వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ మొదట విశాఖపట్నం గ్రేహౌండ్స్ వద్ద విధులు నిర్వహించిన అనంతరం చింతపల్లి అదనపు ఎస్‌పిగా విధులు నిర్వహించానని తెలిపారు. ప్రస్తుతం ఏలూరు జిల్లా ఎస్‌పిగా తనను నియమించడం సంతోషంగా ఉందని తెలిపారు. చరిత్ర ఉన్న చారిత్రాత్మక జిల్లాకు ఎస్పీగా పని చేయడం సంతోషంగా ఉందన్నారు. మహిళల భద్రతకు సంబంధించిన అంశాలకు పూర్తి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ప్రస్తుతం పోలీసు శాఖలో కొత్త యువ నీరు ప్రవేశిస్తోందని, కొన్ని రోజుల్లో పూర్తిగా యువతరం పోలీస్ శాఖలో ఉంటుందని తెలిపారు. హోంగార్డ్ స్థాయి నుండి జిల్లా అధికారుల వరకూ సమర్థవంతమైన పోలీసులను నిర్వహించేందుకు తర్ఫీదు ఇచ్చేందుకు రంగం సిద్ధం చేస్తున్నామని తెలిపారు. జిల్లా అదనపు ఎస్‌పిలు స్వరూప రాణిశేఖర్, సూర్యచంద్రరావు, డిఎస్‌పిలు శ్రీనివాసులు, నిన్న మురళీకృష్ణ, సిఐలు ప్రభాకర్ శ్రీనివాసరావు రాజశేఖర్ తదితర అధికారులు ప్రతాప్ శివ కిషోర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ వెట్రి సెల్విని ఎస్‌పి మర్యాదపూర్వకంగా కలిశారు.

ఏకలవ్య స్కూల్లో సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న గిరిజన, ఎస్ఎఫ్ఐ నేతలు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ఏకలవ్య మోడల్ స్కూల్లో సమస్యలను పరిష్కరించాలని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం, ఎస్ఎఫ్ఐ ప్రభుత్వాన్ని కోరింది. ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో మండలంలోని ఇప్పపాడు గ్రామంలోని ఏకలవ్య మోడల్ స్కూల్‌ను నేతలు సందర్శించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు తెల్లం రామకృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లెనిన్ మాట్లాడారు. 390 మంది విద్యార్థులు చదువుకునే చోట వర్కర్లు ఎనిమిది మంది ఉన్నారని, వర్కర్ల కొరత తీవ్రంగా ఉందని, ప్రభుత్వం వెంటనే స్పందించి అదనంగా వర్కర్లను ఏర్పాటు చేయాలని కోరారు. ఆట స్థలాల్లోనే మొక్కలు పెరగడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వాటిని తొలగించాలని తెలిపారు. విద్యార్థుల మంచాలపై పరుపులు లేవని, ఏర్పాటు చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థులకు తగిన విధంగా వంట సామగ్రి లేదని దీంతో వంటకి ఇబ్బందవుతోందన్నారు. కొత్తగా వచ్చిన పర్మినెంట్ స్టాఫ్ హిందీ కావడంతో, హిందీ రాష్ట్రాల నుంచి రావడంతో ఇంగ్లీషు బోధించే సందర్భంలో హిందీ పదాలు కూడా ఉపయోగిస్తున్నారని, అర్థం కావడం లేదని విద్యార్థులు తమ వద్ద చెప్పారని తెలిపారు. విద్యార్థుల చేతులకు, కాళ్లపై పొక్కులు వస్తున్నాయని తెలిపారు. వెంటనే మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. సమస్యలను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు వినోద్, మంగరాజు పాల్గొన్నారు.

అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలి

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీల స్వీకరణలో కలెక్టర్ వెట్రిసెల్వి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో స్వీకరించిన అర్జీలకు అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో అర్జీదారుల నుంచి కలెక్టర్ కె.వెట్రిసెల్వి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తోపాటు జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, ఏలూరు ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె.ఖాజావలీ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.ముక్కంటి ఉన్నారు. కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ అర్జీలను అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. ఒకసారి అందిన అర్జీ తిరిగి రెండోసారి రానివిధంగా పరిష్కార క్రియ ఉండాలన్నారు. ప్రజల నుండి స్వీకరించిన అర్జీలను ఆయా శాఖల పరంగా పరిష్కారం కోసం పంపిన వాటిపై చర్యలు తీసుకొని యాక్షన్ టేకెన్ రిపోర్టు సమర్పించాలన్నారు. సర్వే, తదితర అంశాలపై ఫిర్యాదు అందిన మరుసటి రోజే సంబంధిత విఆర్ఒ, తదితరులతో విచారణ చేసి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి సోమవారం అందే అర్జీలపై సత్వర పరిష్కార చర్యలు తీసుకుంటూ ఆవారంలో శుక్రవారం నాటికి సమగ్ర నివేదిక తమకు సమర్పించాలని కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. డొమెస్టిక్ వైలెన్స్‌కు సంబంధించి ఎక్కువగా ఫిర్యాదులు అందుతున్నాయని, పోలీస్ అధికారులు వాటిపై తగు విచారణ చేసి కౌన్సెలింగ్ నిర్వహించి సంబంధిత యాక్షన్ టేకెన్ రిపోర్టు సమర్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పంటల బీమా పరిహారం చెల్లించాలి

18, 19 తేదీల్లో 'గ్రామ సచివాలయాలకు సామూహిక రాయబారాలు'

వ్యవసాయ కార్మిక, రైతు సంఘాల నాయకులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

వ్యవసాయ కార్మిక, రైతు, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 18, 19 తేదీల్లో నిర్వహించే గ్రామ సచివాలయాలకు సామూహిక రాయబారాలు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక అన్నే భవనంలో వ్యవసాయ కార్మిక, రైతు సంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశం ఎం.జీవరత్నం అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ 2023వ సంవత్సరం డిసెంబర్ నెలలో వచ్చిన మిచౌంగ్ తుపాన్ వల్ల గోదావరి డెల్టా ప్రాంతంలో చేతికొచ్చిన వరి పంట దెబ్బతిని రైతాంగం తీవ్రంగా నష్టపోయిందన్నారు. కరువు, తుపాన్లతో దెబ్బతిన్న రైతులకు పంటల బీమా పరిహారం రైతుల ఖాతాల్లో వేయాలన్నారు. ప్రభుత్వం ఆలస్యం చేస్తోందని తెలిపారు. గత 2021, 2022, 2023 సంవత్సరాల పంటల బీమా పరిహారం ఇప్పటి వరకు రైతుల ఖాతాల్లో జమ చేయలేదని తెలిపారు. కొత్త ప్రభుత్వం ప్రీమియంలో రైతులను భాగస్వాములను చేస్తానంటోందన్నారు. ఇప్పటి వరకు ఉచిత పంటల బీమా అమలులో ఉందని, దాని స్థానంలో బీమా ప్రీమియం రైతులు చెల్లించాలనే గతంలో ఉన్న విధానం అమల్లోకి రావొచ్చని, ఇది రైతులకు భారం అవుతుందన్నారు. పంటల బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలని కోరారు. గుర్తింపు కార్డులు లేకపోతే పంట రుణాలు, పెట్టుబడి సాయం, ఇతర ప్రభుత్వ సహాయం ఏది కౌలు రైతులకు అందే అవకాశం లేదన్నారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమైనా వర్షాల నేపథ్యంలో వ్యవసాయ పనులు ముమ్మరం కాలేదని, వ్యవసాయ కార్మికులకు పనులు లేవని, ఈ నేపథ్యంలో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు రాష్ట్రవ్యాప్తంగా గ్రామస్థాయి వరకు మూడు సంఘాల నాయకులు, కార్యకర్తల సమన్వయంతో ఈ నెల 18, 19 తేదీల్లో రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులను కదిలించి గ్రామ సచివాలయ కేంద్రాల్లో సామూహిక రాయబారాలతో వినతిపత్రాలు ఇవ్వాలని పిలుపునిచ్చారు. 2023 ఖరీఫ్ సీజన్‌లో కరువు, తుపాన్ నష్టపోయిన రైతులు, కౌలు రైతుల ఖాతాల్లో పంటల బీమా పరిహారం తక్షణమే వేయాలని డిమాండ్ చేశారు. పెట్టుబడి రూ.20 వేలు ఎన్నికల హామీని తక్షణమే అమలు చేయాలని, రైతులు, కౌలు రైతుల ఖాతాల్లో వేయాలని కోరారు.

పలుచోట వర్షం...స్తంభించిన జనజీవనం



ముదినేపల్లిలో నీట మునిగిన కాలనీ

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలో సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కురిసిన జోరు వానకు జనజీవనం స్తంభించడంతో పాటు మండలంలోని పలు పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం పడడంతో ప్రధాన రహదారులతో పాటు గ్రామాల్లోని అంతర్గత రోడ్లపై నీరు నిలిచి వాహనదారులు, ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. పలు పల్లపు ప్రాంతాల్లోని కాలనీల్లోకి వర్షపు నీరు చేరడంతో కాలనీవాసులు అసౌకర్యానికి లోనయ్యారు. అదేవిధంగా ఉదయం నుంచి వర్షం పడటంతో మండల వ్యాప్తంగా జనజీవనం స్తంభించిపోయింది. కార్మికులు, వ్యవసాయ కూలీలకు పనులు లేకపోవడంతో ఇళ్లకే పరిమితమయ్యారు. జనం బయటికి రాకపోవడంతో చిరు వ్యాపారులు, అన్ని రకాల వ్యాపార దుకాణాలు బేరాలు లేక వెలవెలపోయాయి.

మండవల్లి : తుపాను ప్రభావంతో గత మూడు రోజులుగా విస్తారమైన వర్షాలు కురుస్తుండడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. శుక్రవారం రాత్రి ప్రారంభమైన వర్షం శనివారం రాత్రి వరకు కురుస్తూనే ఉంది. సోమవారం కాస్త ఒక మోస్తరు వర్షం కురిసింది. పెద్దట్లగాడి సిద్ధాంతం రహదారి, పామర్రు దిగమర్రు 165 జాతీయ రహదారి, రుద్రవరానికి వెళ్లే రహదారి, కానుకొల్లు పోలుకొండ రహదారులపై ఏర్పడ్డ గోతుల్లోకి వర్షపు నీరు చేరుకుంది. అంతేకాకుండా గ్రామాల్లో డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో వర్షపు నీరు కలిసి రోడ్లపై చేరుకుని దుర్వాసన వెదజల్లుతున్నాయి. మండవల్లిలో దళితవాడ, మంచాల కాలనీ, బిసి, ఎస్‌సి కాలనీల్లోని రోడ్లపైకి వర్షపు నీరు చేరుకుంది. జాతీయ రహదారి పామర్రు-దిగుమర్రు 165పై మండవల్లి వద్ద పెద్ద పెద్ద గోతులు ఏర్పడడంతో ఆ గోతుల్లోకి నీరు చేరి చెరువులను తలపించాయి. వాహనదారులు నానా అవస్థలు పడ్డారు. గ్రామాల్లోకి చేరిన మరుగునీటితో వ్యాధులు ప్రబులుతాయని గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు అంతేకాకుండా గత నాలుగు రోజులుగా ముసురు పట్టి వర్షాలు పడుతున్నాడంతో రొయ్యల చెరువుల్లో ఆక్సిజన్ శాతం తగ్గడంతో రొయ్యల మత్స్యవాత పడతాయేమో అని రైతులు భయాందోళన చెందుతున్నారు.

వరిచేలకు జీవం పోసిన వర్షం

మండలంలో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలు వెదజల్లిన సార్వా వరి పైరుకు జీవం పోశాయి. మండల వ్యాప్తంగా వేలాది ఎకరాల్లో నెలరోజుల క్రితం రైతన్నలు నేరుగా చేలల్లో విత్తనాలను వెదజల్లారు. వరి విత్తనాలు తరచూ కురుస్తున్న వర్షాలకు మొలకెత్తినప్పటికీ గత పది రోజులుగా వర్షాలు ఆశాజనకంగా లేకపోవడం, కాలువలకు సాగునీరు అందుబాటులోకి రాకపోవడంతో పలు గ్రామాల్లో పైరు ఎండిపోయింది. పలు గ్రామాల్లో పొలాలు కూడా బీటలు వారాయి. ఈ తరుణంలో శుక్రవారం నుంచి వరుసగా వర్షాలు కురుస్తుండటంతో పైరుకు జీవం పోసినట్లు అయింది. వర్షానికి తోడు పోల్‌రాజ్ పంట కాలువకు అధికారులు నీటిని విడుదల చేశారు. దీంతో అటు వర్షాలు ఇటు సాగు, తాగునీరు విడుదల చేయడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కురిసిన వర్షాలతో వరి పైరులో అడుగు లోతు మేర నీరు నిలిచింది.

నీరు నిల్వ లేకుండా చర్యలు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - కామవరపుకోట

మండలంలోని వీరిశెట్టిగూడెం జనగన్న లేఅవుట్‌లో నీరు నిల్వ లేకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. వర్షమొస్తే అవస్థలే..! శీర్షికన ప్రజాశక్తిలో సోమవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మండల విస్తరణాధికారి జి.మరియమ్మ స్పందించి సమస్యను పరిష్కరించాలని పంచాయతీ సిబ్బందికి ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శి బి.బాలాజీ వీరిశెట్టిగూడెం జగనన్న లేఅవుట్‌లో జెసిబి సహాయంతో డ్రెయినేజ్ కాలువను ఏర్పాటు చేసి నీరు నిల్వ లేకుండా వెళ్లేందుకు మార్గం ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించారు.

ఆసుపత్రి అభివృద్ధికి నిధులు మంజూరు

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి ఏరియా కమ్యూనిటీ హాస్పిటల్ అభివృద్ధికి ఎంఎల్‌ఎ రోషన్‌కుమార్ అధికారులతో మాట్లాడి రూ.20 లక్షలు మంజూరు చేయించారని ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కొండ్రు దేవ, భారతి తెలిపారు. ఆసుపత్రిని సోమవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ ఇటీవల ఆసుపత్రిని సందర్శించి బిల్డింగ్ స్లాబ్ లీకేజీలు, కంపూటర్లు కొరత, మంచాల కొరత తదితర సమస్యలు తెలుసుకున్నారన్నారు. దీంతో ఆయన స్పందించి అధికారులతో మాట్లాడి రూ.20 లక్షల నిధులు మంజూరు చేయించారన్నారు. ఎంఎల్‌ఎ ఆదేశాల మేరకు తాము ఆసుపత్రిని పరిశీలించి త్వరితగతిన పనులు జరగడానికి టెండర్లకు అనుమతి ఇచ్చినట్లు చెప్పారు.

విద్యార్థులకు నగదు బహుమతులు

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రతిభ గల విద్యార్థులను గుర్తించి ప్రోత్సహించడం అభినందనీయమని చింతలపూడి బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వక్షదర్‌రావు అన్నారు. కీర్తిశేషులు సింగరవు సంజీవరావు దంపతుల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు చింతలపూడి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు, మూడో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు ప్రతిభ చూపిన విద్యార్థులకు రూ.15 వేల నగదు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు, పెద్దలు పాల్గొన్నారు.

'జనసేనలో క్రియాశీలక సభ్యులుగా చేరండి'

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు నియోజకవర్గంలోని జనసేన పార్టీ అభిమానులు జనసేన పార్టీలో క్రియాశీలక సభ్యులుగా చేరి రూ.ఐదు లక్షల జీవిత బీమాతో పాటు రూ.50 వేల ప్రమాద బీమా పొందగలరని జనసేన పార్టీ నూజివీడు నియోజకవర్గ సమన్వయకర్త బర్మా ఫణిబాబు అన్నారు. జనసేన అధినేత డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు ఈ నెల 18వ తేదీ నుంచి 28వ తేదీ వరకు క్రియాశీలక సభ్యత్వం నమోదు కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. నూజివీడు నియోజకవర్గంలో క్రియాశీలక సభ్యత్వం నమోదు చేసుకోవాలనుకునే వివరాలు జనసేన పార్టీ ద్వారా సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూప్‌ల ద్వారా ప్రతి ఒక్కరికీ తెలిసేలా చర్యలు చేపడతామని బర్మా ఫణిబాబు అన్నారు.

రైతులకు వ్యవసాయ పనిముట్లు ఇవ్వాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

రైతు సేవా కేంద్రాల్లో రాయితీపై రైతులకు వ్యవసాయ పనిముట్లు ఇవ్వాలని రైతు సంఘం మండల కార్యదర్శి శిరిపత్తుల సీతారామయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని కామయ్యపాలెం, పి.అంకంపాలెంలో రైతు సంఘం గ్రామ కమిటీ నాయకులతో కలిసి సచివాలయాల్లో వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు రాయితీపై పురుగుమందులు, వ్యవసాయ పనిముట్లు, టార్పాలిన్లు ఇవ్వాలని కోరారు. రైతులకు ఎన్నికల సమయంలో ఇస్తానన్న రైతు భరోసా రూ.20 వేలు వెంటనే అమలు చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్రం మాదిరి రూ.రెండు లక్షల రుణమాఫీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పి.వెంకటయ్య, బాబు, బి.ప్రకాశరావు, కోదండ రామయ్య, దానయ్య, నరసరావు పాల్గొన్నారు.

ఆదిత్య కళాశాలలో అల్లూరి వర్ధంతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ప్రతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ (పిడిఎస్‌ఒ) ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు శత వర్ధంతి సభ సోమవారం ఏలూరులో నిర్వహించారు. ఆదిత్య డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ఈ సభకు పిడిఎస్‌ఒ జిల్లా కార్యదర్శి ఎస్.మోహన్ అధ్యక్షత వహించగా ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వి.వెంకటేశ్వరరావు పిడిఎస్‌ఒ రాష్ట్ర కమిటీ ప్రచురించిన అల్లూరి సీతారామరాజు శత వర్ధంతి స్టూడెంట్ ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నవ యువ సమాఖ్య (ఎన్‌వైఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌కె.బాషా మాట్లాడారు. అల్లూరి సీతారామరాజు తూర్పుగోదావరి, విశాఖ జిల్లాలోని మన్యం ప్రాంతంలో పర్యటించి బ్రిటీష్ వారు గిరిజనులను పెడుతున్న చిత్రహింసలను చూసి సహించలేక అక్కడి గిరిజన ప్రజలను చైతన్యపరిచి, ఐక్యం చేసి పోరాటాన్ని నడిపారన్నారు. ఆయన చనిపోయి వందేళ్లు అయినప్పటికీ ఆయన ఆశయాలు నేటికీ పరిపూర్తి కాలేదన్నారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌ఒ రాష్ట్ర కోశాధికారి ఎల్.భాను, పట్టణ నాయకులు ప్రశాంత్, సాగర్, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సు

ప్రజాశక్తి - ఉంగుటూరు

తాడేపల్లిగూడెం నుంచి అరుణాచలం గిరి ప్రదక్షిణ కోసం ఆర్‌టిసి ప్రత్యేక బస్సును నడుపుతోందని, ఉంగుటూరు మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవచ్చని తాడేపల్లిగూడెం డిపో మేనేజరు సత్యనారాయణమూర్తి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 19వ తేదీ ఉదయం ఎనిమిది గంటలకు బస్సు బయలుదేరి దారిలో పలు క్షేత్రాలను చూపించి 21న అరుణాచలం చేరుకుంటుందన్నారు. ఆన్‌లైన్ రిజర్వేషన్‌లో బస్సు టికెట్స్ బుకింగ్ సౌకర్యం ఉందని మేనేజర్ తెలిపారు.

మలకచర్ల - కండ్రిగ రోడ్డుకు మరమ్మతులు

ప్రజాశక్తి - దెందులూరు

కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్డుపై ఉన్న గుంతల్లో నీరు చేరి వాహనదారులు, పొలాలకు వెళ్లే రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ ఆదేశాలతో యుద్ధ ప్రాతిపదికన రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చే కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు టిడిపి సీనియర్ నేత కమ్మ సుబ్బారావు, గౌడ సంఘం జిల్లా నాయకులు బాలిన కామయ్య తెలిపారు. రామారావుగూడెం పంచాయతీ పరిధిలోని మలకచర్ల నుంచి కండ్రిగ, గంధివారిగూడెం వరి పొలాలకు వ్యవసాయ క్షేత్రానికి వెళ్లే రహదారి అత్యంత ప్రమాద భరితంగా గుంతలు గుంతలుగా ఉంది. ఆ రోడ్డుపై గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని చేపట్టిన టిడిపి నేతలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు దాసు, బాలిన నాగరాజు, కొత్తపల్లి రామారావు, కొత్తపల్లి రాంబాబు, కాలి గోపి, కొండా బ్రహ్మయ్య ఉన్నారు.

వర్షాకాలంలో జాగ్రత్తలు తప్పనిసరి

నూజివీడు ప్రభుత్వాసుపత్రి వైద్యులు నరేంద్రసింగ్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఆరోగ్యం పట్ల ప్రజలు తగిన జాగ్రత్త చర్యలు పాటించాలని నూజివీడు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.నరేంద్రసింగ్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. దోమతెరల వినియోగంతో దోమ కాటు నుండి రక్షణ పొందవచ్చన్నారు.

పైపులైన్లకు మరమ్మతులు

మండవల్లి :విద్యార్థులకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ధ్వంసమైన పైపులైన్లు పుణ్యస్థాయిలో మరమ్మతులు చేపిస్తామని సర్పంచి మోరి దుర్గాప్రసాద్ అన్నారు. జాతీయ రహదారి అభివృద్ధిలో భాగంగా నిర్వహిస్తున్న పనుల వల్ల కులాయి పైపులైన్లు ధ్వంసమయ్యాయన్నారు. దీంతో ప్రాథమిక పాఠశాల-1 లోకి తాగునీటి సరఫరా నిలిచిపోయింది. ఉపాధ్యాయులు ప్రధానోపాధ్యాయులు దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయించి పైపులైన్ పునరుద్ధరించినట్లు తెలిపారు.

వేతన వెతలు..!

చింతలపూడి నగర పంచాయతీ పారిశుధ్య, నీటి విభాగం కార్మికులకు అందని జీతాలు

అప్కాస్‌లో చేర్చాలని వేడుకోలు

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి మేజర్ పంచాయతీ స్థాయి నుంచి నగర పంచాయతీ స్థాయిగా అప్ గ్రేడ్ మూడున్నరేళ్లు కావస్తుంది. మేజర్ పంచాయతీగా ఉనప్పుడే సుమారు 72 మంది కార్మికులు పని చేసేవారు. మేజర్ పంచాయతీ నుంచి నగర పంచాయతీగా అప్‌గ్రేడ్ అయినా సిబ్బంది పెరగక అదే 72 మంది పని చేస్తున్నారు. నగర పంచాయతీగా అప్‌గ్రేడ్ అయిన తరువాత కార్మికుల జీతం పెరగాల్సి ఉంది. 2022 జులైలో జరిగిన రాష్ట్రవ్యాప్త మున్సిపల్ కార్మికుల సమ్మెలో పారిశుధ్య కార్మికులకు రూ.15 వేల జీతం, హెల్త్ అలవెన్స్ రూ.ఆరు వేలు, నీటి విభాగంలో పనిచేసే కార్మికులకు రూ.15 వేల జీతం ఇచ్చేందుకు అంగీకారం కుదిరింది. అప్పటి నుండి 50 మంది సిబ్బందికి రూ.15 వేల జీతం చెల్లిస్తున్నారు. 30 మంది పారిశుధ్య సిబ్బందికి రూ.ఆరు వేల హెల్త్ అలవెన్స్ ఆప్కాసులో చేర్చనందున చెల్లించడంలేదు. నగర పంచాయతీగా అప్ గ్రేడ్ అయిన తర్వాత సుమారు 17 నెలలు పారిశుధ్య సిబ్బందికి నెలకు రూ.మూడు వేల చొప్పున రూ.51 వేలు, వాటర్ వర్క్స్ సిబ్బంది 17 నెలలకు రూ.42,500 ఇవ్వాల్సి ఉండగా నేటికీ చెల్లించలేదు. 30 మంది పారిశుధ్య కార్మికులకు అప్కాస్ నుంచి రావాల్సిన రూ.1.44 లక్షలు, నగర పంచాయతీ నుంచి రావాల్సిన రూ.51 వేలు బకాయి ఉంది. వాటర్ వర్క్స్ సిబ్బంది ఒక్కొక్కరికి రూ.42,500 చెల్లించాలి. 50 మంది అప్కాస్ లిస్టు జిల్లా కలెక్టర్ కార్యాలయానికి పంపి సుమారు నాలుగు నెలలు గడుస్తున్నా నేటి వరకూ అప్కాస్‌కు పంపడంలో అలసత్వం వహించడం వల్ల కార్మికులు ఆర్థికంగా నష్టపోతు న్నారు. వీరు కాకుండా ఇంకా 22 మంది అతి తక్కువ వేతనం రూ.12 వేలకే ఏళ్ల తరబడి నగర పంచా యతీలో పని చేస్తున్నారు. వీరిని కూడా అప్కాస్‌లో చేర్చి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కార్మికులు కోరుతున్నారు.

పెరిగిన జీతాలు చెల్లించాలి

వెలగడి పద్మ, మున్సిపల్ వర్కర్

నెలల తరబడి కలెక్టర్ కార్యాలయంలో మా అప్కాస్ ఫైల్ పెండింగ్ ఉంది. వెంటనే అప్కాస్‌కి పంపి పెరిగిన మా జీతభత్యాలు చెల్లించాలి.

అప్కాస్‌కు పంపాలి

వి.అనురాధ, మున్సిపల్ వర్కర్

మూడున్నరేళ్ల నుంచి పెరిగిన మా జీతం రాకపోవడంతో మా కుటుంబాలు దుర్భర స్థితిలో ఉన్నాయి. ఫైల్‌ను కలెక్టర్ ఆఫీస్ నుంచి అప్కాస్‌కి పంపాలి.

ఎప్పటినుంచో ఎదురుచూస్తున్నా

టి.వల్లి, మున్సిపల్ వర్కర్

2021 ఫిబ్రవరి నుంచి అప్కాస్‌లో జాయిన్ చేయాలని ఎదురు చూస్తున్నాను. నేటికీ అవ్వకపోవడం బాధగా ఉంది.

కార్మికులకు బకాయిలు చెల్లించాలి

ఆర్‌వివిఎస్.నారాయణ, సిఐటియు నాయకులు

సకాలంలో అధికారులు స్పందించక చింతలపూడి నగర పంచాయతీ కార్మికులను అప్కాసులో చేర్చకపోవటంతో వారికి రావాల్సిన రూ.లక్షలు పెండింగ్‌లో ఉన్నాయి. కలెక్టర్ కార్యాలయంలో ఉన్న 50 మంది కార్మికుల అప్కాస్ ఫైలును వెంటనే సంబంధిత డిపార్ట్‌మెంట్‌కు పంపాలి. కార్మికులకు బకాయిలు చెల్లించాలి. జిల్లా పంచాయతీ అధికారి వద్ద ఉన్న మిగిలిన 22 మంది ఫైల్‌ని కూడా వెంటనే పరిష్కరించాలి.

ప్రతిపాదన పంపించాం

రాజు, చింతలపూడి నగర పంచాయతీ కమిషనర్

50 మంది నగర పంచాయతీ కార్మికులకు అప్కాస్ చేర్చటానికి ప్రతిపాదన పంపించాం. మిగిలిన 22 మందికి అవకాశం లేకుండా పోతుంది. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక అందించాము.

నాచుగుంట క్వారీ మురుగు బోదెలో తూడు తొలగింపు

రైతుల సమన్వయంతో సమస్య పరిష్కారానికి కృషి

ఉంగుటూరు ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - ఉంగుటూరు

నాచుగుంట క్వారీ మురుగు బోదె వల్ల పరివాహక పొలాలు ముంపు బారిన పడకుండా స్థానిక రైతుల సమన్వయంతో శాశ్వత పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు అన్నారు. బాదంపూడి మత్స్య కేంద్రం నుంచి నాచుగుంట అండర్ టన్నెల్ - 3 వరకూ 3.4 కిలోమీటర్ల మేర ప్రవహిస్తున్న నాచుగుంట క్వారీ మురుగు బోదె రైతుల పాలిట దుఃఖ:దాయని శీర్షికను సోమవారం ప్రజాశక్తిలో కథన ప్రచురితమైంది. రైతుల పడుతున్న ఇబ్బందులు, మురుగు కాలువ దుస్థితిని ఆదివారం సాయంత్రమే ఎంఎల్‌ఎ దృష్టికి ప్రజాశక్తి తీసుకెళ్లింది. దీంతో ఎంఎల్‌ఎ స్పందించి డ్రెయిన్స్ అధికారితో కలిసి ఆయకట్టు, పలు గ్రామాల రైతులతో ముంపు బారిన పడిన పొలాలను, మురుగు కాలువను



పనులు చేస్తున్న సిబ్బంది

మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు తాము పడుతున్న బాధలను చెప్పుకున్నారు. ఎన్నోసార్లు ప్రజాప్రతినిధులు వచ్చి చూసి తాత్కాలిక పరిష్కారాలే తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదని, మీరైరా పరిష్కారం చూపాలని వెల్లమిల్లి, బాదంపూడి, నాచుగుంట రైతులు విజ్ఞప్తి చేశారు. బోదె వెంబడి ఆక్రమణలను తొలగించేలా అధికారులతో చర్చించి కార్యాచరణ రూపొందిస్తామని ఎంఎల్‌ఎ చెప్పారు. ఆయనతో పాటు రైతులు పాతూరి విజయ్‌కుమార్, ఇమ్మణి గంగాధర్, కడియాల రవిశంకర్, యాండ్రపు అప్పారావు, సిహెచ్.అప్పారావు టిడిపి, జనసేన నాయకులు తాతిన గోపీ, నరమామిడి నాగేశ్వరరావు, పంది రాంబాబు, బాదంపూడి, వెల్లమిల్లి రైతులు పాల్గొన్నారు. అనంతరం డ్రెయిన్స్ ఎఇ ఎవి.సత్యనారాయణ పర్యవేక్షణలో తూడును కూలీలతో తొలగించే పనులు చేపట్టారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి : సిపిఎం

ప్రజాశక్తి - నిడమర్రు

నిడమరు ప్రజాసంఘాల కార్యాలయంలో గవర సత్యనారాయణ అధ్యక్షతన సిపిఎం సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ నారపల్లి రమణారావు మాట్లాడుతూ మండల కేంద్రం నిడమర్రు నుంచి అడవికొలను, పత్తేపురం వెళ్లే రహదారులు వెంటనే చేయించాలన్నారు. కొల్లేరు గ్రామ ప్రాంతవాసులకు తాగునీరు అందించాలన్నారు. అనంతరం నిడమర్రు తహశీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యలు పరిష్కరించాలని అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో వెలగలేటి మోహన, కానూరు రాజు, లావిటి సోంబాబు, దేవుని విష్ణు, నాని పాల్గొన్నారు.

వసతి గృహాలకు భవనాలు నిర్మించాలని ధర్నా

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మండల కేంద్రమైన బుట్టాయగూడెం ఎస్‌టి బాలుర బాలికల కళాశాల వసతి గృహాలకు నూతన భవనాలు నిర్మించాలని కోరుతూ పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు భూషణం డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల హాస్టల్ విద్యార్థులతో కళాశాల నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ సిహెచ్.వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా భూషణం మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ వసతి గృహాల్లో మెరుగైన సదుపాయాలు లేక విద్యార్థులు దుర్భరమైన జీవితాలను అనుభవిస్తున్నారన్నారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచకపోవడం వలన విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదన్నారు. బుట్టాయగూడెం మండల కేంద్రంలో ఉన్న ఎస్‌టి బాలుర కళాశాల హాస్టల్ శిథిలమై వర్షాలకు పెచ్చులు ఊడి పడుతూ విద్యార్థులు బిక్కుబిక్కు మంటూ భయభ్రాంతులతో జీవిస్తున్నారన్నారు. మెస్ ఛార్జీలు పెంచాలని, నూతన శాశ్వత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఉపాధ్యక్షులు బన్నే వినోద్, పివైఎల్ డివిజన్ సహాయ కార్యదర్శి తగరం బాబూరావు, పిడిఎస్‌యు బుట్టాయగూడెం మండలాధ్యక్షులు మడివి సిద్ధు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా కెఎల్.రావు జయంతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు ఇరిగేషన్ డేటా కాంప్లెక్స్‌లో పద్మభూషణ్ డాక్టర్ కెఎల్.రావు 122వ జయంతి కార్యక్రమాన్ని సోమవారం ఇరిగేషన్ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కెఎల్.రావుకు ఘన నివాళు లర్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏలూరు ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఇ దేవ ప్రకాష్ మాట్లాడుతూ కెఎల్.రావు ప్రముఖ ఇంజినీర్‌గా ప్రసిద్ధ చెంది దేశంలో ఉన్న అనేక కట్టడాలకు స్ఫూర్తిగా నిలిచారన్నారు. చోడగిరి శ్రీనివాస్ మాట్లాడారు.

బహుముఖ నైపుణ్యాల సాధనతో సుస్థిర జీవనోపాధి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

యువత బహుముఖ నైపుణ్యాల సాధన వల్ల సుస్థిరమైన జీవనోపాధిని పెంపొందించుకోవచ్చని గాడ్సన్ మినిస్ట్రీస్ డైరెక్టర్ కె.పాల్ రమేష్ అన్నారు. ప్రపంచ యువజన నైపుణ్యాల దినోత్సవం సందర్భంగా ఎపి రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏలూరులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏలూరుజిల్లా స్కిల్ డెవలప్ మెంట్ అధికారి గంటా సుధాకర్ మాట్లాడుతూ యువతకు వివిధ సాంకేతిక, అభివృద్ధి రంగాల్లో నైపుణ్య శిక్షణ ఇవ్వడం ద్వారా ఉద్యోగ, ఉపాధి రంగాల్లో మెరుగైన మానవ వనరు లను సమకూర్చడానికి ప్రభుత్వం ప్రాధాన్యత నిస్తుందన్నారు. అనంతరం అవగాహనా ర్యాలీ నిర్వహించారు.

చెక్కపల్లిలో వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - ముసునూరు

వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు రమణక్కపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యులు ఎమ్‌డి.కరిముల్లా చెప్పారు. మండలంలోని రమణక్కపేట పిహెచ్‌సి పరిధిలోని చెక్కపల్లిలో సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎమ్‌డి.కరిముల్లా మాట్లాడుతూ గ్రామస్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా ఉండేందుకు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థకు 7 అర్జీలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమానికి ఏడు అర్జీలు వచ్చాయని ఆర్‌డిఒ భవానిశంకరి తెలిపారు. నూజివీడు మండలానికి సంబంధించి ఐదు అర్జీలు, ముసునూరుకు ఒక అర్జీ, ఏలూరుకు సంబంధించి ఒక అర్జీ వచ్చినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థలో ఎంతటి సమస్యనైనా పరిష్కరిస్తామని చెప్పారు. ఏడు అర్జీలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సిఫార్సు చేశారు. నూజివీడు తహశీల్దార్ కార్యాలయంలో ఎటువంటి అర్జీలు రాలేదని తహశీల్దార్ విశ్వనాథ్‌శాస్త్రి తెలిపారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - దెందులూరు

వర్షాలకు సీజనల్ వ్యాధులు విజృంభించే అవకాశం ఉందని, ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు సూచించారు. పెదవేగి మండలం వెంకటకృష్ణాపురం గ్రామంలో పెదవేగి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు డాక్టర్ పూర్ణిమ, డాక్టర్ మాధవి సూచనల మేరకు ఆరోగ్య సిబ్బందిచే ఇంటింటా ఫీవర్ సర్వే, దోమలు లార్వా పెరిగే స్థలాలను గుర్తించి, వాటిని నాశనం చేసే కార్యక్రమం నిర్వహించారు. అక్కడ ప్రజలకు వర్షాకాలంలో సంభవించే డెంగీ, మలేరియా, టైఫాయిడ్, నీళ్ల విరోచనాలు, కామెర్లు పలు వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా, జ్వరాలకు కారణమైన దోమలు మంచినీటి నిల్వ ప్రాంతాల్లో పెరుగుతాయన్నారు. వారానికి ఒకసారి ఫ్రైడే ఆచరించాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత లోపం వల్ల నీళ్ల విరోచనాలు, టైఫాయిడ్, కామెర్లు సంక్రమిస్తాయని, దీనిని దృష్టిలో పెట్టుకుని భోజనానికి ముందు చేతులు పరిశుభ్రం చేసుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని చెప్పారు. ఎవరికి ఎటువంటి అనారోగ్య సమస్య ఉన్న అశ్రద్ధ చేయకుండా వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. అనంతరం ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ డి.రోజ్‌మేరీ, హెల్త్ సూపర్‌వైజర్ రమేష్, హెల్త్ అసిస్టెంట్స్ మేకా శ్రీనివాసరావు, రమేష్ బాబు, ప్రసాద్, విజయవర్ధన్ పాల్గొన్నారు.

దెందులూరులో 'మీకోసం - మీ చింతమనేని' ప్రారంభం

ప్రజాశక్తి - దెందులూరు

'మీకోసం - మీ చింతమనేని" పేరుతో తెల్లవారుజామున ఆరు గంటల నుంచే నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకుని పరిష్కరించేలా దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ నూతన కార్యక్రమం ప్రారంభించారు. తొలిరోజు పర్యటనలో భాగంగా సోమవారం ఉదయం ఆరు గంటల నుంచి నుంచి దెందులూరు మండలం పెరుగుగూడెం, గోవిందపురం, చల్ల చింతలపూడి, కొత్త కమ్మ పేట గ్రామాల్లో పర్యటించారు. పెరుగుగూడెం కమ్యూనిటీ హాలులో గ్రామస్తుల సమక్షంలోనే పలు శాఖల అధికారులతో ఎంఎల్‌ఎ ప్రభాకర్ గ్రామ సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి దెందులూరు మండలాధ్యక్షులు మాగంటి నారాయణ ప్రసాద్ (మిల్లు బాబు), పెదవేగి, పెదపాడు, ఏలూరు రూరల్ మండలాల అధ్యక్షులు బొప్పన సుధ, లావేటి శ్రీనివాస్, నంబూరి నాగరాజు, దెందులూరు మండల సెక్రటరీ నాగనబోయిన సత్యనారాయణ, తెలుగు యువత అధ్యక్షులు మోతుకూరి నాని, టిఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు పెనుబోయిన మహేష్ యాదవ్, క్లస్టర్ ఇన్‌ఛార్జి పరసా వెంకట్రావు, ఎంపిడిఒ శ్రీలత, తహశీల్దార్ జితేంద్ర, పిఆర్‌డిఇ లీలా మోహన్, ఇరిగేషన్ జెఇ కిషోర్, పలు శాఖల అధికారులు, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని పోలీస్ స్టేషన్ రోడ్డును అభివృద్ధి చేసేందుకు రూ.30 లక్షలతో పనులను అధికారులు మొదలుపెట్టారు. గ్రామపంచాయతీ 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం గ్రామ సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ, గ్రామ ఉపసర్పంచి ఈడే సుధాకర్ ప్రారంభించారు. 162 మీటర్ల పొడవునా, ఏడు మీటర్లు వెడల్పున సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నారు. పల్లపు ప్రాంతం కావడంతో వర్షానికి ఈ రోడ్డు నీట మునిగిపోతుంది. దీంతో గ్రామస్తులు మోకాలలోతు నీటిలో రాకపోకలు సాగిస్తూ తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు గ్రామపంచాయతీ పాలకవర్గం నిధులు వెచ్చించి గ్రామాభివృద్ధికి, సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జి.రమేష్, సచివాలయ, పంచాయతీ ఉద్యోగులు పాల్గొన్నారు.

బుర్రకథ కళాకారుల బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

బుర్రకథ కళాకారులకు రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి ఏలూరు జిల్లా సబ్ కమిటీ కన్వీనర్ టివిఎస్.రాజు సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. తెలుగు దేశం పార్టీ గతంలో అధికారంలో ఉన్నప్పుడు జన్మభూమి, గ్రామదర్శిని, నగరదర్శిని తదితర సభలు సమావేశంలో ఆ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడం కోసం కళాకారులంతా కళా ప్రదర్శన నిర్వహించారన్నారు. ఆ ప్రదర్శనలకు సంబంధించిన బకాయిలు నేటికి ప్రభుత్వం చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నాడు కళా ప్రదర్శనలు చేయడానికి వడ్డీలకు తెచ్చిన అప్పులతో పాటు భార్యల మెడలో పుస్తెలు తనఖాపెట్టి ఇబ్బందులు పడాల్సి వస్తుందని తెలిపారు. ప్రభుత్వం కళాకారుల ఆకలి బాధలను అర్థం చేసుకోవాలన్నారు. వెంటనే బకాయిలు విడుదల చేయాలని కోరారు.

కౌలు కార్డులు తీసుకోవాలి

ప్రజాశక్తి - ముసునూరు

కౌలు రైతులందరూ కౌలు కార్డు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎస్.మధుమెహన్ అన్నారు. మండలంలోని రమణక్కపేట గ్రామంలోని రైతు సేవాకేంద్రంలో కౌలు రైతులకు ఎంపిపి కొండా దుర్గాభవాని ఆధ్వర్యంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గాభవాని మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే వివిధ పథకాలు, పలు రాయితీలు పొందాలంటే కౌలు కార్డు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ రామకృష్ణ, గ్రామపంచాయితీ కార్యదర్శి ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

డెంగీపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని చీపురుగూడెంలో డెంగీ మాసోత్సవాల్లో భాగంగా డెంగీపై ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిహెచ్‌ఒ జివి.రమణ ఆధ్వర్యంలో సోమవారం అవగాహనా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ పరిసరాల శుభ్రత అందరి ఆరోగ్యానికి భద్రత అన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అధికారి పివి.శ్రీధర్, సూపర్‌వైజర్ ప్రభాకర్, జానకి, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.